AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
30-3-2026 (Monday) MAIN EDITION

## లొంగిపోయిన మావోయిస్టు కీలక నేత



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. కీలక నేత చెల్లూరు నారాయణరావు అలియాస్ సోమన్న ఆంధ్రప్రదేశ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ప్రస్తుతం నారాయణరావు ఏవోబీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పనిచేస్తున్నారు. సీనియర్ మావోయిస్టు కమాండర్ చెల్లూరు నారాయణరావు విజయవాడలో ఆంధ్రప్రదేశ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. పలువురు ఇతర మావోయిస్టు కేడర్లతో పాటు ఆయన లొంగిపోవడం, ఆంధ్రఒడిశా సరిహద్దు (ఏఓబీ) ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలకు ఒక పెద్ద ఎదురుదెబ్బగా చెప్పవచ్చు.

## కువైట్ పవర్‌ప్లాంట్‌పై క్షిపణి దాడి.. భారతీయుడు మృతి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమాసియాలో యుద్ధం రోజురోజుకూ తీవ్రమవుతోంది. తాజాగా కువైట్‌లోని విద్యుత్, నీటి శుద్ధి కర్మాగారాలపై ఇరాన్ దాడికి పాల్పడింది. ఈ ఘటనలో భారత్‌కు చెందిన ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ విషయాన్ని కువైట్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. క్షిపణి దాడి కారణంగా విద్యుత్, నీటిశుద్ధి కార్మాగారం వద్ద ఓ సర్వీస్ భవనం దెబ్బతిందని కువైట్ అధికారులు తెలిపారు.

## నామినేషన్ దాఖలు చేసిన ముఖ్యమంత్రి



అక్షరటుడే, చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన చెన్నైలోని తన సొంత నియోజకవర్గమైన కొలతూరు నుంచే మరోసారి పోటీ చేస్తున్నారు. ఈ నియోజకవర్గం నుంచి ఆయన వరుసగా నాలుగోసారి బరిలోకి దిగుతున్నారు. కాగా.. తమిళనాడులో ఏప్రిల్ 23న ఎన్నికలు జరుగనున్నాయి.

## ఎమ్మెల్యే పదవికి నితిన్ నబిన్ రాజీనామా



అక్షరటుడే, నేషనల్ డెస్క్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఆయన ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన విషయం తెలిసిందే. అయితే ఎంపీగా ఎన్నికైన రెండు వారాల అనంతరం నితిన్ నబిన్.. నేడు బిహార్ శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు.

## షూటింగ్‌లో ప్రమాదం.. ప్రముఖ హీరో మృతి



అక్షరటుడే, సినిమాడెస్క్: బెంగాలీ నటుడు రాహుల్ అరుణోదయ్ బెనర్జీ మృతి చెందారు. ఒడిశాలోని తలసరి బీచ్‌లో షూటింగ్ సందర్భంగా జరిగిన ప్రమాదంలో మరణించారు. పడవ సీన్ చిత్రీకరణలో భాగంగా సముద్రంలో పడిపోవడంతో, సిబ్బంది బయటకు తీసేలోపే ఆయన ప్రాణాలు కోల్పోయారు.

## ఖర్గ్ ద్వీపం స్వాధీనంపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇరాన్‌లో కీలకమైన ఖర్గ్ ద్వీపం స్వాధీనంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. దానిని అమెరికా స్వాధీనం చేసుకోవచ్చన్నారు. ఇరాన్ ప్రధాన ఎగుమతి కేంద్రమైన ఖార్గ్ ద్వీపం వంటి కీలక మౌలిక సదుపాయాలను స్వాధీనం చేసుకోవడంతో సహా, ఇరాన్‌లోని 'చమురును తీసుకోవడమే తన ప్రాధాన్యత అన్నారు. 'ఖార్గ్ ద్వీపాన్ని తీసుకోవచ్చు, తీసుకోకపోవచ్చు. మనకు చాలా అవకాశాలు ఉన్నాయి. దానివల్ల మనం అక్కడ (ఖార్గ్ ద్వీపంలో) కొంతకాలం ఉండాల్సి వస్తుంది. వారికి ఎలాంటి రక్షణ ఉందని నేను అనుకోవడం లేదు. మనం దానిని చాలా సులభంగా స్వాధీనం చేసుకోగలం,' అని ట్రంప్ అన్నారు.

## ఎయిర్‌పోర్టుల్లో తక్కువ ధరకే స్నాక్స్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఎయిర్‌పోర్టుల్లో ఏది కొనాలన్నా భారీగా రేట్లు ఉంటాయి. ఈ క్రమంలో సామాన్యులకు అందుబాటులో ఉండేలా కేంద్ర ప్రభుత్వం ఉడాన్ యాత్రి పేరిట కేఫ్‌లను ప్రారంభిస్తోంది. ఇందులో రూ.10కే టీ, రూ.20కి కాఫీ అందిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే 57 విమానాశ్రయాల్లో వీటిని ఏర్పాటు చేయగా తాజాగా లక్నోలో ప్రారంభించారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్ మోహన్ నాయుడు ఆదివారం చౌదరి చరణ్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 'ఉడాన్ యాత్రి కేఫ్'ను వర్చువల్‌గా ప్రారంభించారు.

# హేట్ స్పీచ్‌కు చెక్



- బిల్లు ప్రవేశ పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- విద్వేష వ్యాఖ్యలు, వేధింపులపై కఠినచర్యలు
- బిల్లును వ్యతిరేకించిన బీజేపీ
- సెలెక్ట్ కమిటీకి పంపిన స్పీకర్

**ప్రస్తుతం సోషల్ మీడియాలో కొందరు ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. మహిళలు, యువతులను వేధింపులకు గురి చేస్తున్నారు. రాజకీయ నాయకులు, సినీ నటులను ట్రోల్ చేస్తున్నారు. అలాగే కులాలు, మతాలను కించపరిచేలా కొందరు పోస్టులు పెడుతున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధం అయింది. ఈ మేరకు హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) 2026 బిల్లును మంత్రి పొన్నం ప్రభాకర్ అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

సమాజంలో విద్వేష నివారణ కోసం బిల్లు ప్రవేశపెడుతున్నామని మంత్రి పొన్నం ప్రకటించారు. సోషల్ మీడియా వేదికలపై కులమతాలను నిందిస్తూ, మనోభావాలను దెబ్బతీసేలా ప్రసంగాలు, రాతల ద్వారా జరిగే విధ్వంసాలను అరికట్టేందుకు బిల్లును ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. నిందితులకు కఠిన శిక్షలు విధించేలా, బాధితులకు న్యాయం జరిగేలా బిల్లు రూపొందించామని తెలిపారు. నేరస్తులకు ఏడాది నుంచి ఏడేళ్ల వరకు ఏళ్లు జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధించనున్నట్లు వెల్లడించారు. రెండోసారి నేరం చేస్తే పదేళ్ల వరకు జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధించనున్నారు.

### రెండో రాష్ట్రంగా..

ప్రస్తుత చట్టపరమైన వ్యవస్థ విద్వేషపూరిత ప్రసంగాలు, విద్వేష నేరాల స్వభావాన్ని, వాటి రూపాలను సమగ్రంగా పరిష్కరించడం లేదని మంత్రి అన్నారు. ఈ బిల్లును గతంలో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. తెలంగాణ రెండో రాష్ట్రంగా నిలిచింది.

### కఠిన చట్టం అవసరం

బిల్లుపై చర్చ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడారు. సోషల్ మీడియాలో మహిళలపై జరుగుతున్న అసభ్య ప్రచారాన్ని అసెంబ్లీ వేదికగా ఆమె ఖండించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా, సోషల్ మీడియాలో వల్గర్ పోస్టులతో వారిని మానసికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసత్యాలు, హేట్ స్పీచ్‌తో ప్రాణాలు పోతున్నాయని, దీనిని అరికట్టేందుకు కఠిన చట్టం అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి బిల్లును ప్రవేశపెట్టినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

### వ్యతిరేకించిన బీజేపీ

హేట్ స్పీచ్ బిల్లును బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి వ్యతిరేకించారు. చట్టాలు ప్రజల రక్షణ కోసం ఉండాలని, గొంతు నొక్కడానికి కాదన్నారు. ఈ బిల్లును సెలక్షన్ కమిటీకి పంపాలని డిమాండ్ చేశారు. లేదా హౌస్ కమిటీ వేయాలని కోరారు. చర్చ అనంతరం ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపుతున్నట్లు స్పీకర్ తెలిపారు.

## టాటా ఆఫర్.. ఈవీ కార్లపై 20శాతం రాయితీ



**అక్షరటుడే, హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగులకు టాటా గుడ్‌న్యూస్ చెప్పింది. ఈవీ కార్లపై 10 శాతం నుంచి 20 శాతం వరకు రాయితీ ఇవ్వడానికి ముందు కు వచ్చింది. రాష్ట్రంలో ఈవీ వాహనాలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం తెలి సిందే. ఈ మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు రాయితీపై ఈవీ వాహనాలు ఇచ్చేలా ప్రభుత్వం ఆయా కంపెనీలతో చర్చలు జరిపింది. రాయితీ ఇవ్వడానికి ఇప్పటికే పలు కంపెనీలు ముందుకు రాగా.. తాజాగా టాటా సైతం ఓకే చెప్పింది. ఈవీ వాహనాలను ప్రోత్సహించడంలో భాగంగా మినిస్టర్ క్వార్టర్స్ నుంచి అసెంబ్లీకి ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో మంత్రి పొన్నం సోమవారం ఈవీ కారులో ప్రయాణించారు.

## ఎవరిని వదిలిపెట్టం.. పోలీసులకు కేటీఆర్ వార్నింగ్




**అక్షరటుడే, రంగారెడ్డి:** పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకు అక్రమాలకు సహకరించే పోలీసు అధికారులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు. పొంగులేటి అనుచరులు ప్రహరీ కూలుస్తుంటే, పోలీసులు పక్కన కూర్చొని టిఫిన్ తింటున్నారట అన్నారు. రెండున్నరేళ్లలో మళ్లీ తమ ప్రభుత్వం వస్తుందని, అక్రమాలకు సహకరించే ఎవరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సోమవారం రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో పర్యటించారు. కేటీఆర్ మాట్లాడుతూ.. 1960 నుంచే ఇక్కడ సతీష్ షా కుటుంబానికి భూమి ఉందన్నారు. గ్రామం అభివృద్ధి చెందిన తర్వాత ఇక్కడ భూముల విలువలు భారీగా పెరిగాయని చెప్పారు. సతీష్ షా కుటుంబానికి చెందిన భూమి సుమారు రూ.1400 కోట్ల విలువ కలిగి ఉండగా, దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కన్నుపడిందని ఆరోపించారు. మంత్రి పొంగులేటి, ఆయన కుమారుడు హర్షా రెడ్డి కలిసి సతీష్ షా ఇంటికి వెళ్లి, భూమిని డెవలప్‌మెంట్‌కు ఇవ్వకపోతే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని బెదిరించారని కేటీఆర్ ఆరోపించారు.

## ఎమ్మెల్సీ పదవికి నితీశ్ కుమార్ రాజీనామా



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ఎమ్మెల్సీ పదవికి సోమవారం రాజీనామా చేశారు. త్వరలోనే సీఎం పదవికి సైతం రాజీనామా చేయనున్నారు. ఇటీవల ఆయన రాజ్యసభకు ఎన్నికైన విషయం తెలిసిందే. ఎమ్మెల్సీ సంజయ్ గాంధీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్ కుమార్ చౌదరితో కలిసి నితీష్ కుమార్ లేఖను శాసన మండలి ఛైర్మన్‌కు అందజేశారు. బీహార్‌లో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రి కొనసాగిన నితీశ్ జాతీయ రాజకీయాల్లోకి వెళ్తున్నారు. దీంతో తదుపరి సీఎం ఎవరనే చర్చ జోరుగా సాగుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి భారీ మెజారిటీతో విజయం సాధించింది. బీజేపీ 89 స్థానాల్లో, జేడీయూ 85 స్థానాల్లో గెలుపొందాయి. ప్రస్తుతం ముఖ్యమంత్రి పదవిని బీజేపీ తీసుకోనున్నట్లు సమాచారం. ఉప ముఖ్యమంత్రి పదవిని జేడీయూకు ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది. నితీశ్‌కుమార్ కుమారుడు సైతం ఇటీవల ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు.

## డ్రగ్స్ విక్రయిస్తూ దొరికిన రైల్వే ఉద్యోగి



**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ దందా ఆగడం లేదు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను విక్రయిస్తూ పలువురు భారీగా డబ్బులు సంపాదిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ ఎంప్లాయిస్ సైతం డ్రగ్స్ దందా చేస్తుండడం గమనార్హం. హైదరాబాద్‌లోని మోకిలాలో పోలీసులు భారీగా డ్రగ్స్ సీజ్ చేశారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసులు దాడులు చేసి 40 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తి రైల్వే శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. బెంగళూరు, గోవా నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సదరు రైల్వే ఉద్యోగి కారులో డ్రగ్స్ తీసుకువస్తున్నట్లు గుర్తించారు.

## వికసిత్ భారత్‌కు 'ఉడాన్' ఊతం..!




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశీయ విమానయాన రంగాన్ని విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రూ. 28,840 కోట్ల బడ్జెట్‌తో ఉడాన్ 2.0ను ఆమోదించింది. ఈ పథకం అమలు కోసం పదేళ్ల కాలానికి రూ. 28,840 కోట్లు నిధులను కేటాయించారు. ఈ నిధులతో కొత్తగా 100 విమానాశ్రయాలను, 200 ఆధునిక హెలిప్యాడ్‌లను నిర్మించనున్నారు. ఇటీవల ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. చిన్న నగరాల నుంచి నేరుగా విమానాలు నడపడం ద్వారా పర్యాటకం, వ్యాపార రంగాలు అభివృద్ధి చెందడమే కాకుండా ఉపాధి అవకాశాలూ పెరుగుతాయని, ఎత్తయిన పర్వత ప్రాంతాల్లో అత్యవసర సేవలు అందించడం సులవవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం దేశంలోని రీజినల్ ఎయిర్ కనెక్టివిటీని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్ (ఉడాన్) పథకాన్ని తీసుకువచ్చింది.

## బాలయ్య బ్యూటీకి చేదు అనుభవం..



**సినిమా తారలు కనిపిస్తే చాలు ఒక సెల్ఫీ దిగాలని, కనీసం ఒక్కసారైనా వారిని తాకాలని అభిమానులు ఆరాటపడుతుంటారు. అయితే ఈ అభిమానం కొన్నిసార్లు హద్దులు దాటి హీరోయిన్లకు చేదు అనుభవంగా మారుతోంది. తాజాగా 'వీరసింహారెడ్డి' ఫేమ్ హనీ రోజ్ కేరళలోని కోజికోడ్‌లో ఒక ప్రముఖ జ్యువెలరీ షాపు ప్రారంభోత్సవంలో ఆకతాయిల వల్ల తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. సెల్ఫీల వంకతో ఆమెను కొందరు అసభ్యంగా తాకారు. ఆమె నడుముపై, చేతులతో తాకుతూ ఇబ్బంది పెట్టడంతో ఆమె తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. జనం మధ్యలో ఉండడంతో ఆమె ఏమీ అనలేక సైలెంట్‌గా అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ కావడంతో పాటు సెలబ్రిటీల భద్రతపై ఆందోళన కలిగిస్తోంది.**

**–అక్షరటుడే, సినిమాడెస్క్**